సాక్షి అనకాపల్లి

శుక్రవారం। 12। సెప్టెంబర్। 2025



అప్పన్నకు గరుడసేవ

సింహాచలం: సింహాద్రి అప్పన్నకు గురువారం ఆర్జిత సేవలు నిర్వహించారు. గరుడసేవ శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణం నిర్వహించారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు



అనకాపల్లి: దసరా పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే అధికారులు చర్లపల్లి-అనకాపల్లి-చర్లపల్లి ప్రత్యేక రైలు సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈనెల 13 నుంచి అక్టోబర్ 4 వరకు నాలుగు సర్వీసులు నడపనున్నారు. ప్రతి శనివారం చర్లపల్లి నుంచి అనకాపల్లికి ఈ ప్రత్యేక రైలు బయలుదేరుతుంది. ప్రతి ఆదివారం అనకాపల్లి నుంచి తిరుగుపయనమవుతుంది. ఇందులో ఫస్ట్ క్లాస్, టూ టైర్, త్రీ టైర్ ఏసీ సర్వీసులతోపాటు స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచెస్ కూడా ఉంటాయి.

న్యూస్‌రీల్

జీవీఎంసీ టీపీవో సస్పెన్షన్

- లంచం డిమాండ్ చేసినట్టు రుజువు కావడంతో కఠిన చర్యలు

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ అనకాపల్లి జోన్ టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో) కనకారావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్టు జోనల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు. ఇటీవల పట్టణంలో జరుగుతున్న ఒక నిర్మాణానికి లంచం డిమాండ్ చేస్తున్న సమయంలో సెల్‌ఫోన్‌లో కొంతమంది రికార్డు చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల ద్వారా జీవీఎంసీ ప్రధాన కమిషనర్‌కు చేరడంతో ఆయన విచారణకు ఆదేశించారు. విచారణలో ఆరోపణలు నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు. కొత్త టీపీవోగా వరప్రసాద్‌ను నియమించారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గాజువాక టీపీవోగా ఉన్న వరప్రసాద్ అనకాపల్లిలో పూర్తి స్థాయిలో విధులు నిర్వహించనున్నారు.

'విజయ పథం'లో కేజీబీవీలు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి

కశింకోట/ఎస్.రాయవరం: విజయ పథకం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల కార్యదర్శి దేవానందరెడ్డి ఆదేశించారు. కశింకోట మండలంలోని తేగాడ కేజీబీవీ, ఎస్.రాయవరం మండలంలోని తిమ్మాపురం కేజీబీవీలను గురువారం ఆయన సందర్శించారు. విజయపథం కార్యక్రమం, విద్యా ప్రమాణాలు, రికార్డులు, విద్యార్థుల నోట్ పుస్తకాలు, స్లిప్ టెస్ట్ మూల్యాంకనాలను పరిశీలించారు. టెన్త్, ఇంటర్మీడియట్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధనకు పలు సూచనలిచ్చారు. తేగాడలో విద్యార్థులతో సహ పంక్తి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ డి.చంద్రకళ, ఏజీసీడీవో సబియా సుల్తానా, వృత్తి విద్యా సమన్వయకర్త శ్రీలత, జిల్లా జీసీడీవో ఏఎస్‌డీ జెమిమ పాల్గొన్నారు. తిమ్మాపురంలో పాఠశాల భవన నిర్మాణం పూర్తయిన వెంటనే ప్రహరీ నిర్మాణం చేపట్టాలన్నారు.

నర్సీపట్నం మాస్టర్ ప్లాన్‌పై చర్చ

నర్సీపట్నం: నూతనంగా రూపొందించిన మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 2040 నాటికి పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని ఈ మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నట్టు వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ ఆఫీసర్ అరుణవల్లి పేర్కొన్నారు. పట్టణంలో ఇంటర్నల్ రోడ్లతోపాటు ప్రధాన రహదారులు, ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు. అబిద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి, అబిద్ నుంచి చింతపల్లి, అబిద్ నుంచి కె.డి.పేట రోడ్డు వంద అడుగులకు విస్తరించాలని ప్లాన్‌లో పేర్కొన్నారు. దీనిపై పలువురు వ్యాపారస్తులు వారి అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కమిషనర్ జంపా సురేంద్ర పాల్గొన్నారు.

అక్షరమే ఆయుధం





ప్రెస్‌మీట్ కవర్ చేస్తే కేసులు పెడతారా..!

రాజకీయ పార్టీల నాయకుల స్టేట్‌మెంట్లు పత్రికలో పబ్లిష్ చేస్తే రిపోర్టర్లు, ఎడిటర్‌పై కేసులు పెడతారా..? రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్రపు హక్కు లేదా..? మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామనే విషయాన్ని మరచిపోకూడదు. రాజ్యాంగంలో ఆర్టికల్ 19(1)ఎ ప్రకారం జర్నలిస్టుల హక్కులకు రక్షణ ఉంది. ప్రజల పక్షాన గళమెత్తుతున్న 'సాక్షి' గొంతు నులిమే చర్య ఇది. ఏదైనా సమస్య ఉంటే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయాలి. రిజాయిండర్ ఇవ్వాలి. కానీ పత్రికలపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ఇలాంటి సంస్కృతికి బీజం నాటడం భవిష్యత్తులో నిజాన్ని అణగదొక్కినట్లే అవుతుంది. – బూడి ముత్యాలనాయుడు, మాజీ డిప్యూటీ సీఎం



పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్రపు హక్కు లేదా..?

రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోంది. మొదటి నుంచి కూటమి ప్రభుత్వం వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి'పై వేధింపులకు పాల్పడుతోంది. ఒక రాజకీయ పార్టీ నేత ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన మాటలను రిపోర్టర్ వార్తగా రాస్తే ఎడిటర్‌పై కేసు పెడతారా? మీడియా గొంతును నులిమేస్తారా? రాష్ట్రంలో ప్రతికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్రపు హక్కు లేదా..? అక్షరాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను నోటీసులు, అక్రమ కేసులతో నిరోధించలేరు. రాజకీయ కక్షలు కార్పణ్యాలతో పత్రిక ఎడిటర్‌పై కేసుల నమోదు ఏమాత్రం సరికాదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి డబ్బా కొట్టే పచ్చ మీడియా మాత్రమే ఉండాలా? మీ అవినీతి, అక్రమాలను ఎత్తిచూపించే ఏ మీడియా ఉండకూడదా.. అయినా మీకెందుకంత ఉలికిపాటు. – గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి

కళ్లు తెరవండి.. నిజం చెప్పండి



- నర్సీపట్నం మెడికల్ కాలేజీ నిర్మాణం 60 శాతం పూర్తి కావడం నిజం కాదా?
- 50 ఎకరాల్లో 13.21 లక్షల చ.అ. విస్తీర్ణంలో భవన సముదాయం నిర్మించడం నిజం కాదా?
- అందుకు రూ.500 కోట్లు మంజూరు చేయడం నిజం కాదా?
- పేద ప్రజలకు ఎంతో మేలు చేసే వైద్య కళాశాల, బోధనాస్పత్రులను ప్రైవేటుపరం చేయాలన్న మీ కుట్ర నిజం కాదా?

నిజ నిర్ధారణ కోసం పరిశీలనకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకుల సూటి ప్రశ్నలివి..



భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాల భవనాలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, చింతకాయల సన్యాసిపాత్రుడు తదితరులు

ఏజెన్సీ ముఖద్వారమైన నర్సీపట్నం నియోజకవర్గంలో మాకవరపాలెం మండలంలో భీమబోయినపాలెం గ్రామంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల..

ఇది కల కాదు.. నిజమే! అనకాపల్లి జిల్లావాసులతోపాటు సరిహద్దులోని పాడేరు నియోజకవర్గంలో కొన్ని మారుమూల గ్రామాల గిరిజనులకు ఉపయోగపడే విధంగా గత వైఎస్సార్‌సీపీ తలపెట్టిన బృహత్ కార్యక్రమమిది.. విద్య, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యమిచ్చిన దార్శనికుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలల ప్రాజెక్టు ఇది. అందమైన కల కనడమే కాదు.. 50 ఎకరాల్లో 13.21 లక్షల చదరపు అడుగుల్లో రూ.500 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించేందుకు 2022 డిసెంబరు 30న శంకుస్థాపన చేశారు. ఏడాది కాలంలో సగానికి పైగా దాదాపు 60 శాతం నిర్మాణ పనులు పూర్తి చేశారు. బోధనాస్పత్రి భవనంలో మూడు అంతస్తులు సిద్ధమయ్యాయి. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల భవనంలో రెండు అంతస్తులు పూర్తయ్యాయి. అదే వేగంతో నిర్మాణం జరిగితే కొద్ది నెలల్లోనే మొత్తం భవనాలు అందుబాటులోకి వచ్చేవి. కానీ కూటమి ప్రభుత్వం కుటిల బుద్ధితో పనులు నిలిపివేసింది. 15 నెలల కాలంలో అడుగు నిర్మాణం కూడా చేపట్టకపోగా.. ఆ కళాశాలను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌కి అప్పగించేందుకు కుట్రలు పన్నుతోంది. ప్రైవేట్‌కు ధారాదత్తం చేసేందుకు జీవో కూడా విడుదల చేసింది. పైగా నిర్మాణాలు ప్రారంభ దశలోనే ఉన్నాయంటూ అసత్యాలు ప్రచారం చేస్తోంది. అందుకే వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం కళాశాల భవనాలను పరిశీలించారు. రుజువులు, సాక్ష్యాలతో వాస్తవ పరిస్థితిని బయటపెట్టారు.

సాక్షి, అనకాపల్లి:

ఉత్తరాంధ్ర ప్రాంతంలో 1921 సంవత్సరంలో ఆంధ్ర మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. వందేళ్ల తర్వాత ఇదే ప్రాంతంలో అనకాపల్లి, పాడేరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాడేరు మెడికల్ కళాశాల పూర్తి కావడంతో తరగతులు ప్రారంభించేందుకు అనుమతులు ఇచ్చారు. మాకవరపాలెం మండలంలోని కళాశాల భవనాలు దాదాపు 60 శాతం పూర్తయ్యాయి. మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే గ్రామీణ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేవి. జిల్లాలో గల ఆరు నియోజకవర్గాల ప్రజలకు, పాడేరు నియోజకవర్గంలో చింతపల్లి, కొయ్యూరు పరిసర ప్రాంత గిరిజన ప్రజలకు మేలు జరిగేది. కళాశాల ప్రారంభమైతే ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చేవి. తర్వాత పీజీ వైద్య కోర్సులు రావడానికి అవకాశం ఏర్పడేది. కూటమి సర్కారు ప్రైవేటు దాహంతో ఇవన్నీ తీరని కలలా మిగిలిపోయే ప్రమాదం ఏర్పడింది.

వైఎస్సార్‌సీపీ బృందం సందర్శన

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ నేతృత్వంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు చింతకాయల సన్యాసిపాత్రుడు, చిక్కాల రామారావు, ఏరువాక సత్యారావు, తదితరులు భీమబోయినపాలెంలో సగానికిపైగా నిర్మాణం పూర్తయిన మెడికల్ కాలేజీని గురువారం సందర్శించారు. భవనాలు సగానికి పైగా పూర్తయ్యాయని, కూటమి సర్కారు వచ్చాక ఎక్కడి నిర్మాణాలు అక్కడ నిలిపివేయడం దారుణమన్నారు. ప్రజల యోగ క్షేమాలను పరిగణనలోకి తీసుకొని పనులు పూర్తి చేయాలన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన సొంత నియోజకవర్గంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారో తెలియడం లేదంటూ విమర్శించారు. పీపీపీ పద్ధతిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేటుపరం చేయడాన్ని అంగీకరించబోమన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకు తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో కలిసివచ్చే ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. పార్టీ ముఖ్యనేతలు రుత్తల ఎర్రాపాత్రుడు, బోని శివరామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కె.రామకృష్ణ, ఎంపీపీలు రుత్తల సర్వేశ్వరరావు, మణికుమారి, సుర్ల రాజేశ్వరి, సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీలు అప్పలనర్స, సుర్ల వెంకట గిరిబాబు, మాకవరపాలెం, గొలుగొండ, నర్సీపట్నం రూరల్, నాతవరం మండల పార్టీ అధ్యక్షులు చిటికెల రమణ, కొరుప్రోలు ఫాణి తాంథారామ్, సేనాపతి వెంకటరత్నం, నాగేశ్వరావు, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ గారూ.. ముఖం కడుక్కోండి..!

- రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్...ఫేస్ వాష్'
- డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ పోలీసుల ప్రత్యేక కార్యక్రమం
- రాత్రి వేళల్లో నిద్ర మత్తులో తరచూ రోడ్డు ప్రమాదాలు
- జిల్లాలో జాతీయ రహదారిపై 9 బ్లాక్ స్పాట్స్ గుర్తింపు
- హెచ్చరిక బోర్డులు, లైటింగ్ ఇసుక డ్రమ్ముల ఏర్పాటు
- మొబైల్ టీమ్‌లతో అర్ధరాత్రి వేళల్లో డ్రైవర్లకు ఫేస్ వాష్

అర్ధరాత్రి వేళ తెల్లవారుజామున హైవేలో రోడ్డు ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డ్రైవర్ గారూ ఆగండి...నీటితో ముఖం కడుక్కోండి.. అంటూ రోడ్డు ప్రమాదాల నివారణకు అనకాపల్లి జిల్లా పోలీసులు 'స్టాప్-ఫేస్ వాష్' పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అర్ధరాత్రి దాటాక నిద్ర మత్తులోకి జారకుండా వాహన డ్రైవర్లను ఆపి నీళ్లతో ముఖం కడిగించే కార్యక్రమానికి నడుం బిగించారు.



జాతీయ రహదారిపై డ్రైవర్లకు వాటర్‌తో ఫేస్ వాష్ చేయిస్తున్న మొబైల్ పోలీసులు

సాక్షి, అనకాపల్లి :

జాతీయ రహదారిపై సుదూర ప్రయాణం చేసే వాహనదారులు రాత్రి వేళ అలసటతో నిద్రలోకి జారుకోవడం కారణంగా తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అనకాపల్లి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా ఇటీవల ఓ నిర్ణయం తీసుకున్నారు. రాత్రి వేళల్లో నిద్రలేమి కారణంగా జరిగే ప్రమాదాలను నివారించేందుకు, జిల్లా జాతీయ రహదారులపై ఉన్న 9 హైవే మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. అనకాపల్లి జిల్లా పరిధి జాతీయ రహదారి–16 పై లంకెలపాలెం నుంచి పాయకరావుపేట వరకు 80 కిలోమీటర్ల మేర తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను 9 బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ప్రతి 7 నుంచి 14 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఒక్కో పాయింట్లో ఒక మొబైల్ టీమ్ చొప్పున ఏర్పాటు చేశారు. ఒక్కో మొబైల్ టీమ్‌లో ఒక డ్రైవర్, హెడ్ కానిస్టేబుల్ లేదా ఏఎస్‌ఐ ఉంటారు. వీరికి ఫస్ట్ ఎయిడ్‌తో పాటు ఫేస్ వాష్ కూడా శిక్షణ ఇచ్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు నడిపే డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి, అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని సూచిస్తున్నారు. ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకునే బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు, లైటింగ్, ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేసి అప్రమత్తం చేస్తున్నారు.

జాతీయ రహదారులపై ప్రమాదాలు...

చెన్నై–కోల్‌కతా నేషనల్ హైవే మీదుగా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. హైవేకు ఇరువైపులా గ్రామాలు ఉన్నాయి. ప్రధానంగా పరవాడలో ఫార్మా కంపెనీల నుంచి షిఫ్టుల వారీగా కార్మికులు హైవేపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ సమయంలో రాత్రి వేళ ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం ఎక్కువగా ఉంటుంది. ప్రమాదాల్లో అధికంగా డ్రైవర్ల నిద్రమత్తు వల్లే జరుగుతున్నట్టు గుర్తించారు.

సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు, అర్ధరాత్రి 12 తరువాత తెల్లవారుజామున 4 గంటలలోపు అత్యధికంగా ప్రమాదాలు జరిగాయి. జిల్లా పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో 60 శాతం నేషనల్ హైవేపైనే జరగడం గమనార్హం. ఈ నేపథ్యంలో వాహనం నడిపేటప్పుడు నిద్ర వస్తున్నట్టు అనిపిస్తే వాహనాన్ని ఆపేసి కాసేపు విశ్రాంతి తీసుకోవాలని పోలీసులు డ్రైవర్లకు సూచిస్తున్నారు. ఈ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని చెబుతున్నారు.

మొబైల్ టీంలు ఇలా..

అనకాపల్లి పోలీస్ కంట్రోల్ రూమ్ సీఐ ఎస్.రమేష్ పర్యవేక్షణలో మొబైల్ టీంలను దిశానిర్దేశం చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా హైవేలో అనకాపల్లి (కొప్పాక-కశింకోట జంక్షన్), కశింకోట జంక్షన్-ఎనీపాలెం, యలమంచిలి (ఎనీజీపాలెం-రేగుపాలెం), యలమంచిలి (రేగుపాలెం-ధర్మవరం), ఎస్.రాయవరం, నక్కపల్లి (ఉపమాక జంక్షన్- ఉద్దండపురం), పాయకరావుపేట (ఉద్దండపురం-తాండవా జంక్షన్),నబ్బవరం (చిన్నయ్యపాలెం-మత్రిపాలెం) 7 కి.మీలు, పరవాడ (క్యాన్సర్ ఆస్పత్రి-కొప్పాక జంక్షన్)లో మొబైల్ టీంలను ఏర్పాటు చేశారు.

19 పీఎస్‌లకు డ్రోన్ కెమెరాలు

- జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా



మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ మెరుగుకు సూచనలు చేస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

కె.కోటపాడు : జిల్లాలో 19 పోలీస్‌స్టేషన్‌లకు సీఎస్‌ఆర్ నిధులతో డ్రోన్ కెమెరాలను అందించినట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. కె.కోటపాడు పోలీస్‌స్టేషన్‌ను గురువారం వార్షిక తనిఖీ నిర్వహించారు ఈ ఏడాది పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను ఎస్ఐ ఆర్.ధనుంజయ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై నిఘాతో పాటు చోరీ ఘటనల్లో నిందితులను పట్టుకోవడానికి డ్రోన్ నిఘా వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. అలాగే గంజాయి రవాణాను అరికట్టడానికి పటిష్టమైన చెక్‌పోస్టు వ్యవస్థలను ఏర్పాటు చేశామన్నారు. గంజాయి సేవనం, బహిరంగ ప్రాంతాల్లో మద్యపానం వంటి వాటిపై 112కు సమాచారం అందించాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే చోట ప్రయాణికులను అప్రమత్తం చేయడానికి హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, కూడలిలో ట్రాఫిక్ ఇబ్బందులను చక్కదిద్దడానికి ఎస్పీ తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్, చీడికాడ, దేవరాపల్లి ఎస్ఐలు బి.సతీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగ్గురు జైలు సిబ్బందికి చార్జి మెమోలు



చోడవరం సబ్‌జైలు

చోడవరం: సబ్ జైలు నుంచి ఇద్దరు రిమాండ్ ఖైదీలు పరారైన సంఘటనకు సంబంధించి ముగ్గురు చోడవరం సబ్‌జైలు అధికారులకు జైళ్లశాఖ అధికారులు గురువారం చార్జి మెమోలు జారీ చేశారు. ఈనెల 5వ తేదీన చోడవరం సబ్ జైలులో నక్కా రవికుమార్, బెజవాడ రాము అనే ఇద్దరు రిమాండ్ ఖైదీలు విధినిర్వహణలో ఉన్న జైలు వార్డర్‌ను సుత్తితో తలపై కొట్టి గాయపరిచి ఆయన జేబులో ఉన్న తాళాలను తీసుకొని మెయిన్‌గేటు తీసుకొని పరారయిన విషయం తెలిసిందే. తర్వాత 24 గంటలు తిరగకముందే టాస్క్‌ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా పరారైన ఇద్దరు ఖైదీలను పట్టుకొని అరెస్టు చేశారు. అయితే ఎంతో పగడ్బందీగా ఉన్న సబ్‌జైలు నుంచి ఖైదీలు ఇంత సునాయాసంగా పరారవ్వడానికి గల కారణాలపై ఎస్పీ తుహిన్‌సిన్హాతోపాటు జైలు శాఖ ఉన్నతాధికారులు అదే రోజు విచారణ చేశారు. ఈ ఘటనలో సిబ్బంది నిర్లక్ష్యం ఉందని గుర్తించిన అధికారులు ఆ సమయంలో విధినిర్వహణలో ఉన్న జైలు సూపరింటెండెంట్ బాబూరావు, హెడ్‌వార్డర్ వి.వీర్రాజు, వార్డర్ ఎం.అప్పలనాయుడుకు చార్జి మెమో జారీచేశారు. సంఘటన జరిగిన సమయంలో ముగ్గురు వార్డర్లు లోపల, ఒక హెడ్ వార్డరు మెయిన్ గేటు దగ్గర, సబ్‌జైలర్ తన గదిలో విధినిర్వహణలో ఉన్నారు. ఇంత జరగడానికి విధి నిర్వహణలో ఉన్న జైలు అధికారుల నిర్లక్ష్యమే కారణమని, దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ జైలుశాఖ ఉన్నతాధికారులు ముగ్గురికి చార్జి మెమోలు జారీ చేశారు. వారి వివరణ అనంతరం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఉక్కుకు ఉచ్చు?

రూ.3లక్షల కోట్ల ఆస్తి భద్రత ప్రశ్నార్థకం



అగస్టు 25.. స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్–3 పునరుద్ధరణ కోసం భద్రపరిచిన భారీ కాపర్ స్టేవ్స్ చోరీకి గురయ్యాయి. ఒక్కొక్కటి 1,200 నుంచి 1,400 కిలోల బరువుండే ఆరు స్టేవ్స్ మాయమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.50లక్షలకు పైగా ఉంటుందని అంచనా.

సెప్టెంబర్ 10.. స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ) విభాగంలో గుర్తుతెలియని వ్యక్తులు కన్వేయర్ బెల్ట్‌ను కోసేశారు. సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా కన్వేయర్‌ను ప్రారంభించగా, బెల్ట్ కొంత భాగం తెగి ఉండటాన్ని గమనించి, అది పూర్తిగా ధ్వంసం కాకముందే నిలిపివేశారు.

విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న ఈ ఘటనలు కార్మికులు, ఉద్యోగ సంఘాల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ప్రైవేటీకరణ కుట్రలో భాగంగానే యాజమాన్యం భద్రతను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- రాగి స్టేవ్‌లు ఎలా మాయమయ్యాయి
- కన్వేయర్ బెల్ట్‌లను కోసిందెవరు?
- వరుస ఘటనలతో ఆందోళనలో కార్మికులు
- ఉక్కు ఆస్తులకు ఎసరు పెడుతున్నదెవరు?
- యాజమాన్య నిర్లక్ష్యమా? పాలకుల కుట్రా?

సాక్షి, విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేస్తున్న కుయుక్తులు ఉక్కు పరిశ్రమకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. సంవత్సరాలుగా ఉద్యోగ, కార్మిక సంఘాలు తమ కుటుంబాలతో కలిసి రోడ్లపై పోరాటాలు చేస్తున్నా.. కేంద్రం తన పని తాను చేసుకుపోతోంది. ఒక్కో విభాగాన్ని ప్రైవేటీకరణ చేయడానికి చకచకా పావులు కదుపుతోంది. ఖర్చుల తగ్గింపులో భాగంగా స్వచ్ఛంద పదవీ విరమణ పేరుతో ఉద్యోగులను, వేలాది మంది కార్మికులను విడతల వారీగా విధుల నుంచి తొలగించేసింది. ఇదే విధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో భద్రతా సిబ్బందిపైనా వేటు పడింది. ఈ నేపథ్యంలో ప్లాంట్‌లో భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

భారీగా తగ్గిన సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది

దేశంలోని పార్లమెంట్, విమానాశ్రయాలు వంటి అత్యంత కీలకమైన సంస్థలకు రక్షణ కల్పించే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్) విశాఖ ఉక్కు కర్మాగారానికి 1983 ఆగస్టు నుంచి భద్రత కల్పిస్తోంది. రూ.3 లక్షల కోట్ల విలువైన ప్లాంట్ ఆస్తులు, యంత్రాలు, ముడి పదార్థాలను సుమారు 40 ఏళ్లుగా సుమారు 1,013 మంది సిబ్బంది కంటికి రెప్పలా కాపాడారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో 'డిప్లాయ్‌మెంట్ కాస్ట్ కటింగ్'పేరుతో యాజమాన్యం సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని భారీగా తగ్గించింది. మొత్తం 1013 మందిలో ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు వంటి హోదాలో ఉన్న 438 మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం కేవలం 575 మంది సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారు. సిబ్బందిని తగ్గించిన తర్వాత ప్రత్యామ్నాయ భద్రతా ఏర్పాట్లు చేయడంలో యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

యాజమాన్య నిర్లక్ష్యం.. ప్రైవేటీకరణ కుట్ర

కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ ప్రైవేటీకరణకు మొగ్గు చూపడం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందుకు వత్తాసు పలకడంతోనే యాజమాన్యం ప్లాంట్ భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఒక ఉద్యోగి ప్లాంట్‌లోకి వెళ్లి బయటకు రావాలంటే సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది డేగ కళ్లతో పహారా కాసేవారు.

లోపలకు వెళ్లి.. బయటకు వచ్చేటప్పుడు ఉద్యోగి చేతిలో అదనపు వస్తువు ఏదైనా కనిపించినా ఆరా తీసేవారు. ఇప్పుడు సిబ్బంది కొరత కారణంగా భద్రతా ప్రమాణాలు పడిపోయాయి. ఒక్కొక్కటి 1,400 కిలోల బరువున్న కాపర్ స్టేవ్స్ చోరీకి గురైనా గుర్తించలేకపోవడం, అత్యంత కీలకమైన ఆర్ఎంహెచ్‌పీ విభాగంలో కనీసం సీసీ కెమెరాలు కూడా లేకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని ఉద్యోగ, కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి.

ఈ వరస ఘటనల వెనుక ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేసే కుట్ర దాగి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాంట్ భద్రతా వ్యవస్థను బలహీనం చేశారు



స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దొడ్డిదారిన దోచుకోవడానికి పెద్దస్థాయిలో కుట్ర జరుగుతోంది. భద్రతా వలయంలో ఉంటూ నిరంతరం రూ.వేల కోట్ల ఉత్పత్తులున్న చోట్ల బయట వాహనాల్లో వచ్చి చోరీ చేస్తే.. ప్లాంట్‌లో ఏదో జరుగుతోందని అర్థమవుతోంది. కాపర్ స్టేవ్స్ ఒక్కో ప్లేట్ 1.4 టన్నుల బరువు ఉంటుంది. వాటిని ఎత్తాలంటే హైడ్రాలిక్ క్రేన్, లారీ అవసరం. అలాంటివి ఆరు కాపర్ స్టేవ్‌లు మాయమయ్యాయి. ఈ నేరానికి పాల్పడినవారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి. సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని బదిలీ చేసి, సెక్యూరిటీని బలహీనపరిచారు. ప్రజల ఆస్తులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిన చోట, యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని బదిలీ చేసిన తర్వాత ఇంతవరకూ ప్రత్యామ్నాయ భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం గర్హనీయం.

– అయోధ్యరామ్, కన్వీనర్, విశాఖ ఉక్కు పోరాట కమిటీ

గోవాడ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలి



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద ధర్నా చేస్తున్న అఖిల పక్ష రైతు సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు

- అఖిలపక్ష రైతు సంఘం, కార్మిక సంఘాల డిమాండ్
- దశలవారీ ఆందోళనలకు తీర్మానం
- సుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద రైతుల ధర్నా

చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ అఖిల పక్ష రైతు సంఘాలు, కార్మిక సంఘాలు గురువారం ధర్నా నిర్వహించాయి. ఈ ఏడాది క్రషింగ్‌కు సంబంధించి ఇంకా ఎటువంటి ఆదేశాలు, ఫ్యాక్టరీ మిషనరీ ఓవర్‌హాలింగ్ పనులు చేపట్టకపోవడంతో క్రషింగ్ జరుగుతుందా..లేదా అనే ఆందోళనలో రైతులంతా ఉన్నారు. దీంతో కొద్ది రోజులుగా అఖిలపక్ష రైతు సంఘాలు, కార్మిక సంఘాలు కలిసి పలుమార్లు ఆందోళనలు చేశాయి. అయినా ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల స్పందన రాకపోవడంతో మళ్లీ రైతుసంఘాలు, కార్మికులు ప్రత్యక్ష ఆందోళనకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా గురువారం ఫ్యాక్టరీ గేటు వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.50కోట్లు విడుదల చేసి చెరకు రైతులకు పాత బకాయిలు చెల్లించాలని, ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌కు కావలసిన యంత్రాల ఓవర్‌హాలింగ్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని ఆధునీకీకరించాలని, ఈనెల 30వ తేదీలోగా నిర్వహించాల్సిన ఫ్యాక్టరీ మహాజనసభను సకాలంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీని రక్షించుకునేందుకు అవసరమైతే ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా రైతుసంఘాలు, కార్మిక సంఘాలు తీర్మానించాయి. ఈ ఆందోళనలో ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు, కార్మికసంఘం నాయకుడు శరగడం రామునాయుడు, రైతు సంఘాల ప్రతినిధులు దండుపాటి తాతారావు, తనకల జగన్, ఏడువాక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వుషూ పోటీలకు గురుకుల విద్యార్థినులు



రాష్ట్రస్థాయి వుషూ పోటీలకు అర్హత సాధించిన విద్యార్థినులు

నర్సీపట్నం:

స్టేట్ స్కూల్ గేమ్స్ వుషూ పోటీలకు నర్సీపట్నం డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. విశాఖలో సంస్కృతి గ్లోబ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం జరిగిన జిల్లా స్థాయి అండర్ -19 స్కూల్ గేమ్స్ వుషూ పోటీల్లో గురుకుల విద్యార్థినులు పి.దుర్గా భవాని 45 కేజీలు, బి.కావ్య 52 కేజీలు, పి.జ్యోష్ణ మేరీ 60 కేజీలు, వి.ప్రణీతి 65 కేజీల విభాగాల్లో మంచి ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. పీడీ సాయి పర్యవేక్షణలో వుషూ కోచ్ వేపాడ ప్రియాంక శిక్షణలో మెడల్స్ సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ రాజేశ్వరి, శాప్ కోచ్ అబ్బు అభినందించారు.

మండల స్థాయిలో స్కూలు గేమ్స్‌కు సన్నద్ధం

- డీఈవో అప్పారావునాయుడు



మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

కశింకోట: మండల స్థాయిలో స్కూలు గేమ్స్ పకడ్బందీగా నిర్వహించడానికి సన్నద్ధం కావాలని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు పిలుపునిచ్చారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో గురువారం సాయంత్రం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ నిర్వహణకు పీడీలు, హెచ్ఎంలు సమన్వయంతో వ్యవహరించి ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, త్రో బాల్, షటిల్ బ్యాడ్మింటన్, తదితర ఏడు ఆటలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయి తర్వాత జోన్ స్థాయిలో నిర్వహిస్తారన్నారు. ఆ తర్వాత యథావిధిగా జిల్లా, రాష్ట్ర స్థాయి ఆటలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా కె. మహాలక్ష్మినాయుడు, పరిపాలన కార్యదర్శిగా అచ్చయ్యమ్మలను నియమించారన్నారు. వీరిని సమావేశంలో అభినందించారు. ఉప విద్యా శాఖ అధికారి అప్పారావు నాయుడు పాల్గొన్నారు.

మోదీ నేతృత్వంలో దేశాభివృద్ధి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



బీజేపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

అనకాపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. ఎన్టీఆర్ క్రీడా మైదానం నుంచి రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అధ్యక్షతన గురువారం పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ జీఎస్టీలో సంస్కరణల వల్ల ఈనెల 22 నుంచి పలు వస్తువుల ధరలు తగ్గనున్నాయని చెప్పారు. కూటమి పాలనలో పార్టీ శ్రేణుల్లో కొంత మేరకు అసంతృప్తి ఉన్న విషయం పార్టీ దృష్టికి వచ్చిందని, స్థానిక ఎమ్మెల్యేలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనకాపల్లి–రాజమహేంద్రవరం ఆరు లైన్ల జాతీయ రహదారి విస్తరణ పనులకు త్వరలో శ్రీకారం చుడతారన్నారు. ఈనెల 14న విశాఖ రైల్వే క్రీడా మైదానంలో బీజేపీ రాష్ట్ర స్థాయి భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఎంపీ సీఎం రమేష్ పాల్గొన్నారు.

వివిధ వర్గాల వారితో చాయ్ పే చర్చ


అనకాపల్లి టౌన్: స్థానిక నాలుగురోడ్ల జంక్షన్ వద్ద చాయ్ పే చర్చ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు పలు సమస్యలపై వివిధ వర్గాల వారు ఏకరువు పెట్టారు. పట్టణ నడిబొడ్డున, మున్సిపల్ స్కూల్ పక్కన్న డంపింగ్ యార్డు తక్షణమే తరలించాలన్నారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టును అనకాపల్లి వరకు పొడిగించాలన్నారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి


నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి శివపురానికి చెందిన ఎ.సూరిబాబు(37) ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి గురువారం మృతి చెందాడు. ఉదయం చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లిన అతడు ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి మృతి చెందినట్లు టౌన్ ఇన్‌చార్జి సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇష్టంలేని పెళ్లి చేశారని మనస్తాపం

- ఉరేసుకుని యువతి బలవన్మరణం



మృతురాలు లోవలక్ష్మి



పెళ్లినాటి చిత్రంలో భర్త జోగిరాజుతో లోవలక్ష్మి

కోటవురట్ల: ఓ యువతి ఇష్టం లేని పెళ్లి చేశారని తీవ్ర మనస్తాపం చెందింది. మనసు చంపుకుని భర్తతో కాపురం చేయలేక బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఆక్సాహేబుపేటలో గురువారం చోటు చేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన చల్లపల్లి లోవలక్ష్మి (24)కి ఇష్టం లేకపోయినా నాలుగు నెలల క్రితం ఆక్సాహేబుపేటకు చెందిన జోగిరాజుకు ఇచ్చి వివాహం చేశారు. అప్పటి నుంచి కలతగా ఉన్న ఆమె మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో శబ్దం రావడంతో బంధువులు వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కొన ఊపిరితో కనిపించింది. ఆమెను ఉరి నుంచి తప్పించి హుటాహుటిన తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. అయితే లోవలక్ష్మి భర్త జోగిరాజు చాలా మంచి వ్యక్తి అని, అర్థం చేసుకోకపోవడం వల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వర్షం నీరు నిలిచి ఇబ్బందులు



తహసీల్దారు కార్యాలయం వద్ద గుంతల్లో నిలిచిపోయిన వర్షం నీరు

అనకాపల్లి టౌన్‌: జిల్లా కేంద్రంగా ఏర్పడినా అనకాపల్లిలో పరిస్థితులు ఏమాత్రం మారడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. వర్షం కురిస్తే చాలు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణ అధ్వానంగా మారిపోతోంది. ఇక్కడ పెద్ద పెద్ద గంతలు ఏర్పడటంతో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండిపోతోంది. అధికారులు, ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. తక్షణమే గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో సంస్కృతి గ్లోబల్ స్కూల్ యాజమాన్యం

పరవాడ: జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి ఎం.వినోద్‌బాబు ఆదేశాల మేరకు విశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్‌-19 క్రీడా పోటీలకు ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో రైఫిల్ షూటింగ్, వుషు పోటీలు నిర్వహించగా, ఫెన్సింగ్, ఘట్కా, కరాటే, కూరాష్, జూడో ఎంపిక పోటీలు ఎంపీఎస్ జూనియర్ కళాశాలలో జరిపారు. సుమారు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు అండర్‌-19 ఉమ్మడి విశాఖ జిల్లా జట్టుగా రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడాపోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.వి.పుష్పలత పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు అవకాశం కల్పించిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్‌, ఎంపీఎస్ జూనియర్ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



శశికిరణ్‌కు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాక దరి పెద గంట్యాడకు చెందిన వై.శశికిరణ్ రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున దాతకు పీఆర్వో కార్యాలయం సూపరింటెండెంట్ ప్రసన్నలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ ఇచ్చారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 48 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,580	4,930
రెండో రకం	4,000	4,100
మూడోరకం	3,650	3,750

అనకాపల్లి సినిమాలు

రాజా	:మదరాసి
సత్యనారాయణ స్క్రీన్‌-1	:కిష్కింధపురం
సత్యనారాయణ స్క్రీన్‌-2	: కొత్త లోక
పర్తిసాయి	: ఘాటీ
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్‌-12, బీ పాజిటివ్‌-17, ఓ పాజిటివ్‌-28, ఏబీ పాజిటివ్‌-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 361 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 319 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

వ్యాయామం చేసేదెలా?

- మరమ్మతులకు గురైన జిమ్ పరికరాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- వ్యాయామదారులకు ఇబ్బందులు
- పట్టించుకోని కూటమి పాలకులు



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో మరమ్మతుకు గురైన జిమ్ పరికరం

అనకాపల్లి: నిత్య వ్యాయామంతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది. దీనిపై అవగాహన కొరవడటంతో చాలామంది తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణవాసులు నిత్య వ్యాయామంతో ఆరోగ్యంగా ఉండాలని సదుద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ పాలనలో లక్షలాది రూపాయలతో వివిధ పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. కూటమి అధికారంలోకి రాగానే వీటి ఆలనా పాలన పట్టించుకోలేదు. దాంతో జిమ్ పరికరాలు, చిన్నారుల ఆట వస్తువులు మరమ్మతులకు గురయ్యాయి. పార్కులకు వెళ్లే వృద్ధులు, చిన్నారులు, ఇతర వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ పాలనలో పట్టణంలోని శారదానది ఒడ్డున శాంతి పార్కు, విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి, గాంధీనగరం లయన్స్ క్లబ్ వద్ద, గుండా జంక్షన్ సమీప ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయం వద్ద, కోట్నివీధి, ఎన్టీఆర్ క్రీడా మైదానంలో జిమ్‌లను లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశారు. కూటమి ప్రభుత్వంలో వీటి పర్యవేక్షణ లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు, ఇతర వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిరుపయోగంగా ఇంటర్నల్ జిమ్

నిత్యం ఎన్టీఆర్ క్రీడా మైదానానికి ఉదయం, సాయంత్రం వందలాది మంది వస్తుంటారు. ఇక్కడ ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ మరమ్మతులకు గురయ్యాయి. జిమ్ పరికరాలను బాగు చేయలేదు. దాంతో వ్యాయామం చేస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పంద్రాగస్టు పురస్కరించుకుని క్రషర్ బుగ్గ వేయడంతో వాకింగ్ ట్రాక్ చిందర వందరగా మారింది. దాంతో వాకింగ్ కోసం వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఇంటర్నల్ జిమ్‌ను ఇంతవరకూ ప్రారంభించలేదు. దాంతో నిరుపయోగంగా మారింది.

శాంతి పార్కులో..

శారదానది ఒడ్డున శాంతి పార్కును వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, అప్పటి ఎంపీ బీవీ సత్యవతి ప్రత్యేక చర్యలు తీసుకుని అభివృద్ధి చేశారు. ఈ పార్కుకు పలువురు కుటుంబ సమేతంగా వస్తారు. జిమ్‌లో ఆట వస్తువులు ఎక్కువగా ఏర్పాటు చేయడంతో చిన్నారులు ఎక్కువగా సందడి చేస్తుంటారు. ప్రస్తుతం జిమ్‌కు జీవీఎంసీ పర్యవేక్షణ కరువైంది. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేదు. వాకింగ్ ట్రాక్ శుభ్రత గురించి పట్టించుకోలేదు. వ్యాయామ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేయడం లేదు.



రింగ్‌రోడ్డు పార్కులో ధ్వంసమైన సిమెంటు బెంచీలు

పార్కులు, జిమ్‌లు అభివృద్ధి చేయాలి



పట్టణ జీవీఎంసీ పరిధిలో పార్కులు, ఓపెన్ జిమ్‌లు అభివృద్ధి చేయాలి. వైఎస్సార్‌సీపీ పాలనలో ఏర్పాటు చేసి జిమ్ పరికరాలు నిత్యం వ్యాయామం చేయడం వల్ల ప్రస్తుతం మరమ్మతులకు గురయ్యాయి. ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలి.

– వేల్పుల గణేష్, అనకాపల్లి

ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేయాలి



కరోనా విపత్తు తర్వాత చిన్నారులు నుంచి పెద్దల వరకూ వ్యాయామంపై ఆసక్తి పెరిగింది. వ్యాధులు బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యంపై దృష్టి పెట్టారు. ప్రజలకు అనుగుణంగా ప్రభుత్వం జిమ్‌లు ఏర్పాటు చేయాలి. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో వైఎస్సార్‌సీపీ పాలనలో ఏర్పాటు చేసిన నూతన జిమ్ నిరుపయోగంగా ఉంది. దీనిపై అధికారుల దృష్టి సారించాలి.

– కల్యాణ్ చక్రవర్తి, అనకాపల్లి

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

కశింకోట: బాల్య వివాహాల నిర్మూలనకు దోహదపడాలని జిల్లా బాల సంరక్షణ అధికారి రమేష్ కోరారు. సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఆర్‌ఈసీఎస్‌లో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌమార దశలో బాల బాలికలు ఏ విధంగా నడుచుకోవాలనే విషయమై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండకుండా బాలికలు వివాహం చేసుకోవడం చట్ట రీత్యా నేరమన్నారు. లైంగిక వేధింపుల సమస్యలపై పోక్సో చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. బాలికలు, మహిళల రక్షణకు అనేక చట్టాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్ స్టాప్ సెంటర్ కార్య నిర్వహణ అధికారి కె.ఎం.వి. మంజుల వాణి, పోనిక్ మనోహర్, పారా లీగల్ సునీత, కౌన్సిలర్ సంతోష్, ఎల్‌సీపీవో రమాజ్యోతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా మరిడిమాంబ



అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయ రహదారిలోని మరిడిమాంబ ఆలయంలో అమ్మవారి నెల పండగను పురస్కరించుకుని శాకంబరీ దేవిగా గురువారం అలంకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి నెల పండగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల నాయుడు, అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు, కార్యదర్శి కాండ్రేగుల హరి కిషోర్, ఉపాధ్యక్షుడు కేఎం నాయుడు, కోశాధికారి కే శ్రీనివాసరావు, సభ్యులు కొణతాల బాలమురళీ, కర్రి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ పుట్టుక మహోత్సవం



పల్లకిలో అమ్మవారి గరగలు ఊరేగింపు



జముకుల ప్రదర్శన



మహిళల కోలాటాల ప్రదర్శన

కశింకోట: స్థానిక గవరపేటలో దుర్గమాంబ పుట్టుక మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల బుల్లి బాబు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం నుంచి పల్లకితో కనక మహాలక్ష్మి వీధిలో పుట్ట వద్దకు సంప్రదాయంగా డప్పులు, వాయిద్యాలతో వెళ్లి పూజలు చేశారు. అమ్మవారి ప్రతి రూపాన్ని, గరగలను పల్లకిలో తీసుకొచ్చి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సమయంలో ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటాలు, చిటికెన భజనలు, తోడపెద్దు సేవ, నృత్యాలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వృథాగా తాగునీరు



లీకవుతున్న మంచినీటి పైపులైన్

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో మంచినీటి పైపులైన్ దెబ్బతిని నీరు వృథాగా పోతోంది. దీంతో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అయినప్పటికి పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు విమర్శించారు. దీంతో కుళాయిల నుంచి సక్రమంగా నీరు సరఫరా కాలేదన్నారు. దీని దృష్ట్యా సత్వరమే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి లీకేజిని అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

6,127 హెక్టార్లలో వరినాట్లు పూర్తి



గవరపాలెం గౌరీ పీఏసీఎస్ ఉద్యోగులు, రైతులతో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

అనకాపల్లి: డివిజన్ పరిధిలో 37 రైతు సేవా కేంద్రాలకు రెండో విడతగా 456 మెట్రిక్ టన్నులు యూరియా రావలసి ఉందని వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకుడు సీహెచ్.సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ (పీఏసీఎస్) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో అనకాపల్లి, కశింకోట, మునగపాక, పరవాడ, సబ్బవరం మండలాల్లో వరి సాధారణ విస్తీర్ణం 6,717 హెక్టార్లకు గాను నేటి వరకూ 6,127 హెక్టార్లలో వరినాట్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. మిగిలిన హెక్టార్లో నాలుగు, ఐదు రోజుల్లో వరినాట్లు వేస్తారన్నారు. చెరకు సాధారణ విస్తీర్ణం 2,194 హెక్టార్లకు గాను 1,008 హెక్టార్లో నాటారన్నారు. ఇంత వరకూ డివిజన్ పరిధిలో 2,397 మెట్రిక్ టన్నులు యూరియా అందించామన్నారు. యూరియా బస్తాకు బదులుగా ఎకరానికి 500 ఎం. నానో యూరియా 200 లీటర్ల నీటిలో పిచికారీ చేయాలన్నారు. రైతులు గడ్డి పెంపకానికి యూరియా తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో గౌరీ పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పోరాట యోధుడు 'సురవరం'

సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో ఎమ్మెల్యే కొణతాల



సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, సత్యనారాయణ

అనకాపల్లి: కామ్రేడ్ సురవరం సుధార్‌రెడ్డి 66 ఏళ్లుగా తన జీవితాన్ని కమ్యూనిస్టు ఉద్యమానికే అంకితం చేశారని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.వి.సత్యనారాయణ కొనియాడారు. గురువారం స్థానిక న్యూ కాలనీ రోటరీ హాల్లో కామ్రేడ్ దివంగత సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామిక, కార్మిక వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం సురవరం సుధాకర్ రెడ్డి పోరాటం చేశారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో పోరాటం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన వ్యక్తి మన మధ్య లేకపోవడం విచారకరమన్నారు. బాల్యంలోనే పాఠశాలలో చాక్ పీసులు, బ్లాక్ బోర్డు కోసం పోరాడారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.శంకరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, పార్టీ నాయకులు వై.ఎస్.భద్రం, కోరుబిల్లి శంకరరావు, రాజాన దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

నాతవరం : గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేశామని నాతవరం ఎస్ఐ సిహెచ్. భీమరాజు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో లింగంపేట పంచాయతీ శివారు కొత్తరామచంద్రపురం గ్రామ సమీపంలో ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తుండగా పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద నుంచి 13 మద్యం క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు.

తాళ్లపాలెం పీహెచ్‌సీ స్థాయి పెంపునకు కృషి



తాళ్లపాలెంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) స్థాయికి పెంపొందించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హామీ ఇచ్చారు. మండలంలోని తాళ్లపాలెంలో రూ.కోటి వెచ్చించి నిర్మించిన పలు అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. దీనిలో భాగంగా పీహెచ్‌సీ ప్రాంగణంలో రూ.50 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ పనితీరును పరిశీలించిన ఆయన మాట్లాడుతూ తాళ్లపాలెం కూడలి నుంచి నర్సీపట్నం వరకు నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించాల్సి ఉందని, అక్కడి నుంచి చింతపల్లికి డబుల్ రోడ్డు నిర్మించాల్సి ఉందన్నారు. ఈ మేరకు స్పీకర్ అయ్యన్న పాత్రుని దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. విశాఖ నుంచి రాజమండ్రి వరకు ఆరు లేన్ల రోడ్డుగా విస్తరించనున్నారని, దీంతో తాళ్లపాలెం కూడలిలో ఫ్లై ఓవర్ వంతెన, డైవర్షన్ రోడ్డు రానున్నాయన్నారు. తాళ్లపాలెంతోపాటు ఇతర గ్రామాల్లో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసి, నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. తాళ్లపాలెం సంత ప్రాంతంలో మురుగు కాలువలు లేక ఇబ్బంది పడుతున్నామని, వాటిని నిర్మించాలని స్థానిక మహిళలు కోరారు. బంగారయ్యపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, తాళ్లపాలెంలో సరిపడిన మేరకు కుళాయిల నుంచి తాగునీటిని అందించాలని కోరారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, సిబ్బందికి సూచించారు. తాళ్లపాలెం సంతలో నాబార్డు నిధులతో నిర్మించిన దుకాణ సముదాయ షెడ్డులు, నూకాంబిక ఆలయం, రామాలయం, బంగారయ్యపేట శివాలయం, గొర్రెల సంత వద్ద నిర్మించిన సిమెంట్ ప్లాట్ ఫారాలు ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళీధర్, వేగి గోపీకృష్ణ, కర్రి సత్యనారాయణ, గళ్లా రాజు, దాడి నాగరాజు, ఉలిలంగల రమేష్, వేగి రామకోటేశ్వరరావు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో ధర్మారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి సుమ, వ్యవసాయ అధికారి స్వప్న, గ్రామ స్వరాజ్య సమితి కార్యదర్శి బద్ది రాము పాల్గొన్నారు.

ఉపాధి మస్తర్‌లో దిద్దుబాట్లు, కొలతల్లో తేడాపై ఆగ్రహం

- రూ.14.77 కోట్ల ఉపాధి పనులకు మండల స్థాయి ప్రజా వేదికలో సామాజిక తనిఖీలు
- రూ.14 వేలు రికవరీకి ఆదేశం, పంచాయతీ రాజ్ పనుల్లో రికవరీకి సిఫార్సు



సామాజిక తనిఖీల ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ పూర్ణిమదేవి

సబ్బవరం: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల కొలతల్లో తేడాలు, మస్తర్లలో దిద్దుబాట్లపై డ్వామా పీడీ ఆర్.పూర్ణిమదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంతోపాటు పలు అభివృద్ధి పనులు, సామాజిక పింఛన్లు వంటి రూ.14.77 కోట్లకు సంబంధించిన ఆడిట్‌ను స్థానిక మండల పరిషత్ ఆవరణలో గురువారం నిర్వహించారు. 18వ విడత మండల స్థాయి సామాజిక తనిఖీల ప్రజావేదికలో భాగంగా ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పద్మజ, జిల్లా విజిలెన్స్ అధికారి రవీంద్ర ఆధ్వర్యంలో పలు గ్రామాల ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ తనిఖీలు చేపట్టారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల నందు రూ.14 వేలు రికవరీ చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. మస్తర్ షీట్లలో దిద్దుబాట్లు, కొలతల్లో తేడాలు మరోసారి జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన వర్క్‌లపై క్వాలిటీ ఎంక్వయిరీ వేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్ చేపట్టిన పలు వర్క్‌లలో రికవరీకి ఆదేశించారు.

ఎంపీపీ బోకం సూర్యకుమారి మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ప్రాధాన్యతా క్రమంలో ప్రజలకు ఉపయోగపడేలా చేపట్టాలన్నారు. సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించడం ద్వారా అవినీతికి తావులేకుండా, పనుల్లో నాణ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ మణికుమార్, స్టేట్ ఎస్టీ గౌరీశంకర్, ఎస్ఆర్పీ చిరంజీవి అప్పారావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోలు వసంతకుమార్, శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి పథకం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి



మృతుడు సత్యారావు

అచ్యుతాపురం రూరల్: మండలంలోని చీమలాపల్లిలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన రైతు నగిరెడ్డి సత్యారావు (48) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. సత్యారావు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వాడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తన కుమారుడిని మద్యానికి డబ్బులడగ్గా, నిరాకరించడంతో మనస్తాపానికి గురై గత శనివారం గడ్డి మందు తాగాడు. దాంతో కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం వేకువజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ నమ్మి గణేష్ తెలిపారు.

ఆటోడ్రైవర్ల ఆందోళన



రావికమతంలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు, సీఐటీయు సభ్యులు

రావికమతం : ఆటో డ్రైవర్లు రోడ్డెక్కారు.మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలని ఆటో డ్రైవర్లు మండల కేంద్రంలో గురువారం ఆందోళన చేపట్టారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఉచిత బస్సు పథకం వల్ల ఆటోలకు బేరాలు లేక, ప్రైవేటు ఫైనాన్స్ వారి వద్ద తెచ్చిన అప్పులు చెల్లించలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి మాట్లాడుతూ ఏటా వాహనమిత్ర పథకం కింద రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రావికమతం ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కె.వరహాలబాబు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైస్ ప్రెసిడెంట్ ఎస్.సోమునాయుడు, సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు



రోలుగుంట: మండలంలోని బుచ్చింపేట గ్రామానికి చెందిన వివాహిత మాకిరెడ్డి రామతల్లి(43) అదృశ్యంపై ఆమె భర్త రాజు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ నెల 9న ఆమె నర్సీపట్నంలో ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాలేదు. దాంతో ఆందోళన చెందిన భర్త తన బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆమె జాడ లేకపోవడంతో రోలుగుంట పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పి.రామకృష్ణారావు తెలిపారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తరపూజ చేశారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.